

12, 13 తేదీల్లో ఐలు రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలి

తణుకు రూరల్: ఐలు రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి కామన మునిస్వామి న్యాయవాదులకు పిలుపునిచ్చారు. సోమవారం తణుకు బార్ అసోసియేషన్ వద్ద న్యాయవాదులు మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ కరపత్రాలు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కామన మునిస్వామి మాట్లాడుతూ ఈనెల 12, 13 తేదీల్లో గుంటూరులో ఐలు రాష్ట్ర 12వ మహాసభ జరుగుతుందని తెలిపారు. ఈ మహాసభలో న్యాయవాదుల సమస్యలపైన చర్చిస్తారని, న్యాయవాదుల రక్షణ కోసం చట్టం చేయాలని ప్రభుత్వానికి తీర్మానం చేస్తామని, వివిధ కోర్టుల పరిధిలో న్యాయవాదులు, మహిళా న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంపై చర్చిస్తామని, పెండింగ్‌లో ఉన్న కేసుల సత్వర పరిష్కారం కోసం కక్షిదారుల కోర్టుకు తెలియజేస్తామని, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, న్యాయవ్యవస్థ కార్యాలయాల నిర్మాణానికి నిధులు, జూనియర్ న్యాయవాదులకు నెలకు రూ.10వేలు చొప్పున ఉపకారవేతనం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు కొర్ర వెంకటేశ్వర్లు, డి.అప్పారావు, పులేశ్వరరావు, కె.శ్రీనివాస్, వి.వెంకటకృష్ణ, డి.భాస్కర్‌రావు, ఆర్‌వి.సురేష్‌బాబు పాల్గొన్నారు.



గొమ్ముగూడెంలో సిఎం జగన్

వారు చెబుతారు.. వీరు మాట్లాడతారు

అధికారులు ముందుగా నిర్ణయించినవారే సిఎం ముఖాముఖికి అనుమతి

లోపలకు వెళ్లాలంటే అధికారులు జారీ చేసిన స్లిప్పులు ఉండాల్సిందే

నిర్బంధం నడుమ గొమ్ముగూడెంలో సిఎం పర్యటన

కొండలు, గుట్టలపై ఉండే నిర్వాసితుల బాధ వినేవారే కరువు

సిఎం రాక నేపథ్యంలో గొమ్ముగూడెం వాసులకు రూ.6.37 లక్షల చొప్పన పరిహారం జమ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

సిఎంకు నేరుగా తమ సమస్యలు చెప్పుకునే అవకాశం కొండలు, గుట్టలపై బాధలు అనుభవించేవారికి దక్కలేదు. అధికారులు ముందుగా ఎంపిక చేసి ఏం మాట్లాడాలో శిక్షణ ఇచ్చిన వారికే సిఎం వద్ద మాట్లాడే అవకాశం దక్కింది. దీంతో వారు చెప్పిందే.. వీరు మాట్లాడతారన్నట్లు పరిస్థితి తయారైంది. కుక్కునూరు మండలం గొమ్ముగూడెం గ్రామంలోని వరద బాధితులను పరామర్శించేందుకు సిఎం ఆ గ్రామంలో పర్యటించారు. మధ్యాహ్నం 1.45 గంటలకు రావాల్సిన సిఎం 3.10 గంటలకు గొమ్ముగూడెం గ్రామ సరిహద్దులో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌కు చేరుకున్నారు. ఆయనకు మంత్రులు, ఎంఎల్ఎలు, అధికారులు పెద్ద ఎత్తున పుష్పగుచ్చాలు ఇచ్చి స్వాగతం పలికారు. అక్కడి నుంచి వాహనంపై సిఎం గొమ్ముగూడెం గ్రామానికి చేరుకున్నారు. గ్రామం పొడవునా రోడ్డుకి ఇరువైపులా బారికేడ్లు ఏర్పాటు చేయడంతో గ్రామస్తులంతా బారికేడ్ల బయటే నిలబడి ఉండాల్సి వచ్చింది. సిఎం గ్రామంలో నడుచుకుంటూ బాధితులను పరామర్శిస్తూ పలుకరిస్తూ ముందుకు నడిచారు. దాదాపు గంట సేపు సిఎం గ్రామంలో పర్యటించారు. అనంతరం తిరిగి వాహనంపై హెలీప్యాడ్ వద్దకు చేరుకుని నిర్వాసితులతో ముఖాముఖి కార్యక్రమానికి హాజరయ్యారు. నిర్వాసితులతో మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా వరద బాధితులను ప్రభుత్వం ఆదుకుందన్నారు. రెండు నెలల రేషన్ బియ్యం, ఐదు రకాల సరుకులు అందించామన్నారు. వరద నీరు చేరిన ప్రతి ఇంటికీ రూ.రెండు వేల నగదు అందించామన్నారు. దెబ్బతిన్న ఇళ్లకు సంబంధించి రూ.10 వేలు పరిహారం అందించేలా ఆదేశాలు జారీ చేశామన్నారు. కలెక్టర్ ఆ కార్యక్రమాలు సక్రమంగా చేసినట్లు స్పష్టమవుతుందన్నారు. వరద బాధితులకు సహాయక చర్యల్లో ఇబ్బందులు లేకుండా ఉండటం కోసమే తాను వారం తర్వాత వచ్చానన్నారు. కేంద్ర ప్రభుత్వం నిధులిస్తే తప్ప నిర్వాసితులకు పరిహారం అందించలేమని తేల్చేశారు. మూడు దశలో పోలవరం పూర్తి చేస్తామని, 41.15 కాంటూరు పరిధిలో గ్రామాలకు జనవరిలో పునరావాస ప్యాకేజీ ఇస్తామన్నారు. రూ.పది లక్షల పరిహారం హామీ, భూములకు ఇవ్వాల్సిన రూ.5 లక్షల హామీ జనవరి, ఫిబ్రవరి నెలల్లో అందిస్తామన్నారు. 2025 ఖరీఫ్ నాటికి పోలవరం పూర్తి చేస్తామన్నారు. కేంద్ర నిర్వహించిన లైడార్ సర్వేనే అంతిమం అంటూ తేల్చేశారు. ఈ సందర్భంగా అధికారులు ముందుగానే నిర్ణయించిన నిర్వాసితులు మాట్లాడుతూ వరద బాధితులకు వైసిపి ప్రభుత్వం గొప్పగా చేసిందంటూ సిఎం పొగడ్తలతో ముంచెత్తారు. అంతే తప్ప కొండలు, గుట్టలపై పునరావాస కేంద్రంలో ప్రతియేటా నిర్వాసితులు పడుతున్న ఇబ్బందులపై చర్చకు రాని పరిస్థితి నెలకొంది. కాంటూరు పరిధిలోని గ్రామాల్లో రోడ్లు వంటివి వేయడం లేదని, చిన్నపాటి వరదలకు మునిగిపోతున్న గ్రామాలను 41.15 కాంటూరులో చేర్చాలని మాత్రం ప్రస్తావించారు. మాట్లాడిన వారిలో వైసిపికి చెందిన కుక్కునూరుకు చెందిన నాయకురాలు, వేలేరుపాడు మండలానికి చెందిన కన్వీనర్ ఉండడం విశేషం.



అనారోగ్య బాధితుణ్ని పరామర్శిస్తున్న జగన్

నిర్బంధాల నడుమ సిఎం పర్యటన

గతంలో మాదిరిగానే నిర్బంధాల నడుమ సిఎం జగన్ పర్యటన సాగింది. మీడియాను హెలీప్యాడ్ వద్దే ఆపేశారు. సిఎం పర్యటనలో ఎక్కడా మీడియాను వెళ్లకుండా అడ్డుకున్నారు. కేవలం సమాచార శాఖ పంపించిన వార్త ఫొటోలతోనే రాసుకోవాలని చెప్పిన పరిస్థితి నెలకొంది. అంతేకాకుండా వివిధ గ్రామాలకు చెందిన నిర్వాసిత ప్రజానీకం సిఎం పర్యటనకు వచ్చినా హెలీప్యాడ్ వద్దే ఆపేశారు. అధికారులు స్లిప్పులు జారీ చేసినవారిని మాత్రమే లోపలికి అనుమతించారు. దీంతో నిర్వాసితులంతా తీవ్ర అసంతృప్తికి లోనయ్యారు. పలు గ్రామాలకు చెందిన నిర్వాసితులు సైతం సిఎం పర్యటనకు రాకుండా ముందుగానే పోలీసులు హెచ్చరికలు జారీ చేసినట్లు చెబుతున్నారు. సిఎం పర్యటన నేపథ్యంలో గొమ్ముగూడెం గ్రామానికి చెందిన 245 కుటుంబాలకు రూ.6.37 లక్షల చొప్పున పరిహారం జమ చేశారు. మరి మిగిలిని గ్రామాల వారి పరిస్థితి ఏమిటో ఒక్క మాట కూడా మాట్లాడలేదు. పోలీసు సిబ్బంది సైతం తాగునీరు, భోజనం వంటివి లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సాయంత్రం ఆరు గంటలకు నిర్వాసితులతో ముఖాముఖి ముగించుకుని సిఎం వెనుదిరిగారు. ఈ సందర్భంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఇద్దరు వ్యక్తులను నాయకులు సిఎం దగ్గరకు తీసుకెళ్లగా వారికి సాయం చేసేందుకు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కొట్టు సత్యనారాయణ, తానేటి వనిత, స్థానిక ఎంఎల్ఎ తెల్లం బాలరాజు, మాజీ మంత్రి ఆళ్ల నాని తదితరులు పాల్గొన్నారు.

నదుల అనుసంధానానికి జగన్ తూట్లు

'పోలవరం' పర్యటనలో టిడిపి అధినేత చంద్రబాబు



ప్రాజెక్టు మ్యాపును పరిశీలిస్తున్న చంద్రబాబు



చింతలపూడి ఎత్తిపోతల వద్ద సెల్ఫీ దిగుతున్నచంద్రబాబు

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం ప్రాజెక్టు నిర్మించి నదులను అనుసంధానం చేయడం ద్వారా రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేయాలని తాను భావించానని, ప్రస్తుత వైసిపి ప్రభుత్వం దానికి తూట్లు పొడిచిందని టిడిపి అధినేత చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. సాగునీటి ప్రాజెక్టుల విధ్వంసంపై యుద్ధభేరిలో భాగంగా ఆయన జిల్లాలోని పట్టిసీమ, పోలవరం ప్రాంతాల్లో సోమవారం పర్యటించారు. తొలుత చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని సందర్శించారు. సెల్ఫీ దిగి సందడి చేశారు. అనంతరం పట్టిసీమను సందర్శించారు. అనంతరం యామిని కళ్యాణ మండపానికి చేరుకుని పోలవరం ప్రాజెక్టుపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. టిడిపి హయాంలో చేపట్టిన పనులు, వైసిపి అధికారంలోకి చేసిన పొరపాట్లు ఇవంటూ వివరించారు. అనంతరం పోలవరం ప్రాజెక్టు పనులను సందర్శించారు. పోలవరం ప్రాజెక్టులో స్పిల్‌వే, ఎగువ, దిగువ కాపర్ డ్యామ్‌లను, డయాఫ్రమ్ వాల్ ప్రాంతాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ మాగంటి బాబు, మాజీ మంత్రులు కెఎస్.జవహర్, దేవినేని ఉమామహేశ్వరరావు, నిమ్మకాయల చినరాజప్ప, పీతల సుజాత, ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు, మాజీ ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు పర్యటన నేపథ్యంలో పోలవరం ప్రాజెక్టు ముఖద్వారం వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సుమారు 200 మంది పోలీస్ బలగాలు పోలవరం ప్రాజెక్టు నుండి పట్టిసీమ వరకు మొహరించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా పోలవరం డిఎస్‌పి శ్రీనివాసులు పోలీస్ బందోబస్తు నిర్వహించారు. కన్నాపురం అడ్డరోడ్డు వద్ద పోలీసులు వాహనాలు నిలిపివేయడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. సుమారు 8 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. పోలవరం ప్రాజెక్టు ముఖద్వారం వద్ద పోలీస్ అధికారులు ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద కార్యకర్తలను పోలీసులు అడ్డుకున్నారు.



శాంతిర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవ సోదరులు, నాయకులు

మణిపూర్‌లో శాంతి నెలకొల్పడంలో బిజెపి విఫలం

బుట్టాయగూడెం: మణిపూర్‌లో శాంతియుత వాతావరణం నెలకొల్పేలా కేంద్ర ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని కోరుతూ పాస్టర్స్ ఫెలోషిప్, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో బుట్టాయగూడెంలో సోమవారం నిరసన ర్యాలీ చేపట్టారు. కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి అందుగుల ఫ్రాన్సిస్, అఖిల భారత రైతు కూలి సంఘం జిల్లా నాయకులు కారం రాఘవ, ప్రగతిశీల యువజన సంఘం సహాయ కార్యదర్శి తగరం బాబూరావు పిడిఎస్‌యు రాష్ట్ర పూర్వపు కార్యదర్శి ఎస్.రామ్మోహన్ మాట్లాడుతూ మణిపూర్‌లో క్రైస్తవులపై, గిరిజనులపై జరుగుతున్న మారణకాండను ప్రభుత్వం గుర్తించి ఆ రాష్ట్రంలో కేంద్ర బలగాలను ఉన్న ఫళంగా దింపి ఈ దుర్ఘటనలకు పాల్పడే వ్యక్తులను కఠినంగా శిక్షించాలని కోరారు. దేశంలో అన్నిరకాల జాతులు, మతాలు, కులాల వారు జీవిస్తున్నారని, అందరూ సోదరభావంతో ఉండాలని పాస్టర్లు సూచించారు.

సమస్యలు పరిష్కరించకపోతే 17న చలో విజయవాడ

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ - మున్సిపల్ కార్మికుల కలెక్టరేట్ ముట్టడి విజయవంతం



ఏలూరులో..

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మున్సిపల్ కార్మికులకు ఎన్నికలకు ముందు ప్రతిపక్ష నేత హోదాలో ఇచ్చిన హామీలు పర్మినెంట్ చేయడం, సమాన పనికి సమాన వేతనం అమలు చేయని పక్షంలో ఈ నెల 17న చలో విజయవాడ, సిఎం క్యాంపు కార్యాలయ ముట్టడి చేపడతామని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ హెచ్చరించారు. మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులు, ఇంజినీరింగ్ కార్మికులు, ఆప్కాస్ సిబ్బంది, క్లాప్ ఆటో డ్రైవర్లు తమ సమస్యల పరిష్కారానికి రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా సోమవారం చేపట్టిన జిల్లా కలెక్టరేట్ ముట్టడిని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. సిఎం జగన్ అధికారం చేపట్టి నాలుగేళ్లు దాటినా ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని విమర్శించారు. రూ.లక్ష జీతమైనా తక్కువే అని చెప్పిన సిఎం నేడు పిఆర్‌సి, కనీస వేతనం కూడా అమలు చేయడం లేదన్నారు. ఈ సమస్యలు పరిష్కరించని పక్షంలో అన్ని జిల్లాల మున్సిపల్ కార్మికులు ఈ నెల 17న సిఎం క్యాంపు కార్యాలయాన్ని ముట్టడిస్తారని హెచ్చరించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమాన్నుద్దేశించి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా గౌరవాధ్యక్షులు బి.సోమయ్య మాట్లాడుతూ సిఎం జగన్ ఎన్నికలకు ముందు తన మేనిఫెస్టో బైబిల్, ఖురాన్, భగవద్గీత వంటిదని చెప్పారని, అయితే ఆ మేనిఫెస్టోలో పెట్టిన సమాన పనికి సమాన వేతనం మున్సిపల్ కార్మికులకు వర్తింపజేయడం లేదని విమర్శించారు. ఆప్కాస్ సిబ్బంది సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మె చేపడతామని, దానికి ప్రభుత్వానిదే బాధ్యతని హెచ్చరించారు. కలెక్టరేట్ ముట్టడిలో వందలాది మంది స్త్రీ, పురుష కార్మికులు ఏలూరు, చింతలపూడి, జంగారెడ్డిగూడెం మున్సిపాల్టీల నుండి పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.జాన్‌బాబు అధ్యక్షత వహించగా సిఐటియు నగర అధ్యక్ష కార్యదర్శులు బి.జగన్నాధరావు, వి.సాయిబాబు, నాయకులు ఆర్‌వి.సత్యనారాయణ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు బాలరాజు, బి.భవాని, పద్మ, గొయ్యమ్మ, నాగరాజు, రాజు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమానికి బంగారు వెంకటేశ్వరరావు, పి.విష్ణు తదితరులు నాయకత్వం వహించారు. అనంతరం ఇన్‌ఛార్జి డిఆర్‌ఒ సత్యనారాయణకు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు.

నూజివీడు రూరల్: తమ సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ కార్మికులు నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ధర్నానుద్దేశించి సిఐటియు జిల్లా కార్యదర్శి జిజరాజు మాట్లాడుతూ మున్సిపల్ కాంటాక్ట్ కార్మికులకు నష్టం కలిగించే ఆప్కాస్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. మున్సిపల్ కాంటాక్ట్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణాధ్యక్షులు ఎన్‌ఆర్.హనుమాన్లు మున్సిపల్ యూనియన్ నాయకులు జయలక్ష్మి, రజని, ఏడుకొండలు, రాజేంద్ర, గంగాధర్, జయరాం, సుధీర్, గాంధీ, పద్మ, రాణి గౌరీ పాల్గొన్నారు.



నూజివీడులో..



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

9న విజయవాడలో మహాధర్నా జయప్రదం చేయాలి

ఏలూరులో మోటార్‌సైకిళ్లపై ప్రచార ర్యాలీ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల తొమ్మిదో తేదీన విజయవాడలో కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో చేపడుతున్న మహాధర్నాలో కార్మికులు, ఉద్యోగులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. మహాధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ ఏలూరులో సోమవారం ఎఐటియుసి, ఐఎఫ్‌టియు, సిఐటియు నాయకులు, కార్యకర్తలు మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించి విస్తృత ప్రచారం చేశారు. ఏలూరు జ్యూట్ మిల్లు వద్ద ప్రారంభమైన బైక్ ర్యాలీ వసంత మహల్ సెంటర్, కర్రలవంతెన, పవర్‌పేట రైల్వే స్టేషన్ రోడ్డు, ఆర్‌ఆర్ పేట, ప్రభుత్వాసుపత్రి మీదగా ఫైర్ స్టేషన్ సెంటర్ వరకూ ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా ఎఐటియుసి జిల్లా నాయకులు కె.కృష్ణమాచార్యులు, సిఐటియు జిల్లా కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్, ఐఎఫ్‌టియు రాష్ట్ర సహాయ కార్యదర్శి యు.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం బ్రిటిష్ వారిని తరిమికొట్టేందుకు క్విట్ ఇండియా ఉద్యమానికి పిలుపు ఇచ్చారని, అదేవిధంగా దేశంలోని ప్రభుత్వరంగ సంస్థలను ప్రయివేటీకరిస్తూ దేశాన్ని తిరోగమనంలోకి తీసుకెళ్తున్న మోడీ ప్రభుత్వాన్ని సాగనంపాలనే పిలుపుతో కిట్ మోడీ - సేవ్ ఇండియా నినాదంతో ఈ మహా ధర్నా జరుగుతుందని తెలిపారు. మోడీ విధానాలను తిప్పికొట్టాలని, ప్రభుత్వరంగ సంస్థలను కాపాడాలని, భారతదేశ లౌకిక రాజ్యాన్ని రక్షించుకోవాలని, మణిపూర్‌లో మారణకాండను నిరసిస్తూ కార్మిక సంఘాలు దేశవ్యాప్తంగా ఆందోళనకు పిలుపునిచ్చాయని తెలిపారు. ఈ ర్యాలీలో ఎఐటియుసి జిల్లా కన్వీనర్ బండి వెంకటేశ్వర రావు, జిల్లా నాయకులు పుప్పాల కన్నబాబు, ఎ.అప్పలరాజు, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు, సిఐటియు నాయకులు బి.జగన్నాథం, వి.సాయిబాబు, బి.సోమయ్య, పి.కిషోర్, ఐఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి బద్దా వెంకట్రావు, అప్పారావు, కాకర్ల శ్రీను, కె.రామకృష్ణ, జాన్‌బాబు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఎల్ఎ ఆళ్ల నాని

ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

ఎన్‌జిఒ 21వ మహాసభ వాల్‌పోస్టర్ ఆవిష్కరణలో ఎంఎల్ఎ నాని

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఉద్యోగుల సంక్షేమానికి జగన్ ప్రభుత్వం ఎల్లప్పుడు కృషి చేస్తుందని ఎంఎల్ఎ ఆళ్ల నాని అన్నారు. ఈనెల 21, 22 తేదీల్లో విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరిగే ఎపి ఎన్‌జిఒ 21వ మహాసభ గోడపత్రిక పశ్చిమగోదావరి జిల్లా ఎన్‌జిఒ సంఘం అధ్యక్షులు చోడగిరి శ్రీనివాస్, కార్యదర్శి నెరుసు రామారావు ఆధ్వర్యంలో ఎంఎల్ఎ సోమవారం క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యోగుల ఫ్రెండ్లీ ప్రభుత్వమని, ఈ మహాసభ ద్వారా ఉద్యోగులకు మేలు జరగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు తాలూకా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీధర్‌రాజు, సత్యనారాయణ, ఉమెన్ వింగ్ చైర్‌పర్సన్ నాగమణి, ఏలూరు తాలూకా ఎన్‌జిఒ సంఘ నాయకులు శ్రీనివాస్, నరేంద్ర, బేగ్, రవికుమార్, సునీత, ఝాన్సీ, సత్య భారతి పాల్గొన్నారు.

సిఎం పర్యటన వల్ల ఒరిగింది శూన్యం

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - ఏలూరు

వరద ప్రాంతాల్లో ముఖ్యమంత్రి పర్యటన బాధితులను నిరాశపరిచిందే తప్ప, అక్కడ ప్రజలకు ఒరిగిందేమీ లేదని సిపిఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి విమర్శించారు. అల్లూరి జిల్లా కూనవరం, ఏలూరు జిల్లా కుక్కునూరులో సిఎం వరద ప్రాంతాల పర్యటన వల్ల ప్రయోజనం శూన్యమన్నారు. గతంలో చెప్పిన విషయాలే మళ్లీ ప్రస్తావించారు తప్ప కొత్తదనమేదీ లేదని తెలిపారు. 41.5 కాంటూరు వద్ద అదనంగా 32 గ్రామాలను మొదట ఆర్‌అండ్ఆర్ ప్యాకేజీలో చేరుస్తున్నామని చెబుతున్నారని, కానీ గత సంవత్సరం వరదల్లో 37 మీటర్లకే 193 గ్రామాలు మునిగాయని ప్రజలు ఎంత ఆందోళన చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వ చెవికెక్కడం లేదని విమర్శించారు. 41.5 మీటర్ల ఎత్తు వరకూ మునిగే గ్రామాలదే తన బాధ్యత అని చెబుతున్న సిఎం 41 మీటర్లలోపు మునిగిన గ్రామాల గురించి ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. గత సంవత్సరం వచ్చిన వరదలకు పునరావాస కాలనీలే మునిగిపోయాయనే అంశం రాష్ట్ర ప్రభుత్వానికి తెలియదా అని ఎద్దేవా చేశారు. తప్పుడు తడకల కాంటూరు లెక్కలతో సంబంధం లేకుండా 1986, 2022 వరదల ఆధారంగా పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు. కాంటూరు లెక్కలే తప్పని లిడార్ సర్వే రుజువు చేసిందని గుర్తు చేశారు. వరదల ఆధారంగా తిరిగి పరిశీలన చేసి ముంపు గ్రామాలకు పునరావాసం కల్పించాలని కోరారు. డ్యాం నిర్మాణంకోసం ఉదారంగా నిధులిస్తున్న ప్రభుత్వాలు నిర్వాసితులకు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. కాంట్రాక్టర్లకు ఒకచట్టం, నిర్వాసితులకు మరోచట్టం ఉందా? అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా అనేక మందిని గృహ నిర్బంధం చేశారని, ఎంపిక చేయబడిన వారిని సభకు తరలించి చప్పట్లు కొట్టించుకోవడం అవమానకరమన్నారు. వరద వచ్చిన ప్రాంతాల్లో అరకొర సౌకర్యాలు కల్పించి, అధికారులను వెన్నుతట్టడానికి వచ్చానని చెప్పడం దుర్మార్గమన్నారు. నిధులివ్వకుండా అధికారులు ఏం చేయగలరు, ప్రభుత్వ వ్యతిరేకతను అధికారుల మీదకు నెట్టివేయాలని చూడడం తగదన్నారు. సిఎం జగన్ క్షేత్రస్థాయిలో వాస్తవాలు తెలుసుకుని న్యాయమైన సహాయం ప్రజలకు అందేలా చూడాలని రవి డిమాండ్ చేశారు.

పోలవరం నిర్వాసితులకు పరిహారం, ప్యాకేజీ, పునరావాసానికి కేంద్రం నిధులివ్వాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన సోమవారం ఢిల్లీలో చేపట్టిన మహాధర్నాలో పాల్గొన్న ఏలూరు జిల్లావాసులు




రెసిడెన్షియల్‌ను జెడి ఆకస్మిక తనిఖీ..

ఎపి రెసిడెన్షియల్ స్కూల్‌లో ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - చింతలపూడి

నాగిరెడ్డి గూడెం ఎపి రెసిడెన్షియల్‌ను ఏలూరు జిల్లా సాంఘీక సంక్షేమ శాఖ జెడి జయప్రకాష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. చింతలపూడి మండలం నాగిరెడ్డిగూడెం ఎపి రెసిడెన్షియల్ స్కూలును జిల్లా కలెక్టర్ గారి ఆదేశాల మేరకు ఆకస్మికంగా తనిఖీ చేశామన్నారు. పూర్తి నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందిస్తామని తెలిపారు.


పోషకాహార కిట్లు అందజేస్తున్న సర్పంచి

గర్భిణులు, బాలింతలకు పోషకాహార కిట్లు పంపిణీ

ప్రజాశక్తి - చాట్రాయి

పర్వతాపురం గ్రామంలో సోమవారం అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణీలకు, బాలింతలకు పోషకాహార కిట్లను గ్రామ సర్పంచి మిద్దె శివరామకృష్ణ పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణీలకు, బాలింతలకు పోషకాహార విలువ కలిగిన ఆహారాన్ని పంపిణీ చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త, గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.

ఎన్‌ఆర్‌ఐ ప్రొఫెసర్‌కు డాక్టరేట్

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

మండల పరిధిలోని ఎన్‌ఆర్‌ఐ ఇంజనీరింగ్ కళాశాలల్లో, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న కమ్ములూరి బాబురాజాకు ఆంధ్రాయూనివర్శిటీ మెకానికల్ ఇంజనీరింగ్ విభాంగంలో డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లుగా ఎన్‌ఆర్‌ఐ కళాశాల ఛైర్మన్ రావి వెంకట్రావు తెలిపారు. ఈ సందర్భంగా ఛైర్మన్ వెంకట్రావు ఆయనకు డాక్టరేట్ పట్టాను అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డా.సి.నాగభాస్కర్, అకడమిక్ డైరెక్టర్ డా.జి.సాంబశివరావు, ఆర్‌అండ్‌డి అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ డా.జి.రోషయ్య, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి : ఎంఎల్‌ఎ


ప్రజాశక్తి - నూజివీడు రూరల్

ప్రజాప్రతినిధులు తీసుకొచ్చే సమస్యలను అధికారులు పరిష్కరించాలని ఎంఎల్‌ఎ మేక వెంకట ప్రతాప్ అన్నారు. ఉపాధి హామీపై విద్యుత్ శాఖ అధికారులతో ఎంఎల్‌ఎ సోమవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎపిసిపి డిపిఎల్ ఎస్ఇ మురళీమోహన్, దేశి రెడ్డి రాఘవరెడ్డి, ఇఇ సత్యనారాయణ, ఎంపిపి ఆరేపల్లి శిరీష, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

స్థానిక బాలికల ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థినీలకు పిపిఎన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పుస్తకాలు పంపిణీ చేసారు. సోమవారం సూపర్ స్టార్ మహేష్ బాబు 48 వ జన్మదినం సందర్భంగా స్థానిక కెఎంజి యూత్ అధ్యక్షులు ఉగ్గం దుర్గా ప్రసాద్ ఆధ్వర్యంలో పిపిఎన్ ఫౌండేషన్ వారు నోట్ బుక్స్, పెన్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమం కృష్ణ ఫాన్స్ సీనియర్ నాయకులు చంద్రరావు, అభిమానులు సురేష్, ఫిరోజే, ఎం.సాయి, గణేష్, గంగాధర్, సాయి, కిరణ్, కిషోర్, అనిల్ యాదవ్, నాగు, శ్రీను పాల్గొన్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న డివిఇఒ ప్రభాకరరావు

నాడు-నేడు నిధులతో కాలేజీలో సదుపాయాలు

ప్రజాశక్తి - ఉంగుటూరు

నారాయణపురం మహాత్మాగాంధీ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో నాడు-నేడు పథకంతో వచ్చిన నిధులతో మౌలిక సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని డివిఇఒ ఆర్.ప్రభాకరరావు తెలిపారు. సోమవారం ఆకాలేజీలో నాడు-నేడు పనులను పరిశీలించారు. అనంతరం తరగతి గదిలో విద్యార్థులతో మాట్లాడారు. ఫస్ట్ ఇయిర్‌లో 82 మంది విద్యార్థులు చేరడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. మూడో యూనిట్ పరీక్షలతో విద్యార్థులు సంసిద్ధం అవ్వాలని అందుకు తగిన సూచనలిచ్చారు. ప్రభుత్వం పేద విద్యార్థుల కోసం కళాశాలలో మౌలిక వసతుల కల్పనకు విశేషంగా కృషి చేస్తోందన్నారు. సంబంధిత నిర్మాణ పనులపై అధ్యాపకులతో సమీక్ష నిర్వహించారు. ఇంఛార్జి ప్రిన్సిపల్ బివి శ్రీనివాస్ పాల్గొన్నారు.

చంద్రబాబు పర్యటనకు తరలిన టిడిపి శ్రేణులు

ప్రజాశక్తి - టి.నరసాపురం

టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు జిల్లా పర్యటనలో యుద్ధభేరి కార్యక్రమంలో భాగంగా, పోలవరం ప్రాజెక్టు సందర్శనకు వస్తున్న నేపథ్యంలో సోమవారం మండలంలోని టి.నరసాపురం, మక్కినవారిగూడెం, తిరుమలదేవిపేట తదితర గ్రామాల నుంచి టిడిపి నాయకులు భారీ సంఖ్యలో తరలి వెళ్లినట్లు టిడిపి రాష్ట్ర నాయకులు జయవరపు శ్రీరామమూర్తి, శీలం వెంకటేశ్వరావులు తెలిపారు. మండల టిడిపి అధ్యక్షులు నాయుడు రామకృష్ణారావు గౌడ్ ఆధ్వర్యంలో 500 మంది టిడిపి శ్రేణులు 100 కార్లతో ర్యాలీగా బయలుదేరి పోలవరం వెళ్లారు. ఈ కార్యక్రమంలో మండలపార్టీ ప్రధాన కార్యదర్శి అచంట అనీల్ కుమార్, బిసి సెల్ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ రవి కొండపల్లి, మాజీ జడ్‌పిటిసి నల్లూరి చలపతిరావు, మండల అధికార ప్రతినిధి కొల్లి మురళీకృష్ణ, మాజీ వైస్ ఎంపిపి అద్దంకి జగ్గారావు, ఎస్‌సి సెల్ అధ్యక్షులు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

నాటుసారా తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - చింతలపూడి

ద్విచక్రవాహనంతో నాటుసారా తీసుకువెళ్తుండగా వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం చింతలపూడి మండలంలో యర్రంపల్లి వాహన తనిఖీలు చేస్తుండగా ఒక వ్యక్తి 10 లీటర్ల నాటు సారాయి మోపెడ్‌పై తరలిస్తుండగా ఒకరిని అదుపులోనికి తీసుకుని వారి వద్ద నుంచి 10 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. మోపెడ్‌తో సహా చింతలపూడి ఎస్ఇబి పోలీస్ స్టేషన్ నందు వారిపై తగు చర్యలు తీసుకొనుటకు కొరకు అప్పగించినట్లు తెలిపారు.

చేనేత కార్మికుల సమగ్రాభివృద్ధికి చట్టం చేయాలి

ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

చేనేత కార్మికుల సమగ్రాభివృద్ధికి చట్టం చేయాలని, చేనేతకు మరణ శాసనమైన జిఎస్‌టి నుంచి చేనేతను మినహాయించాలని, చేనేత రిజర్వేషన్ చట్టాన్ని పటిష్టంగా అమలు పరచాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం ఏలూరు జిల్లా కార్యదర్శి పిచ్చుక ఆదిశేషు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆగస్టు 7వ తేదీన జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా సోమవారం ఉదయం స్థానిక పత్తే బాధ మరక వారి వీధి సెంటర్లో ప్రపంచ చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించి చేనేత కార్మికులకు బిస్కెట్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ముందుగా చేనేత మగ్గం పతాకాన్ని పిచ్చుక ఆదిశేషు ఆవిష్కరించారు. అనంతరం ఇటీవల కాలంలో ఆత్మహత్యలు చేసుకున్న చేనేత కార్మికులకు సమావేశం సంతాపం తెలియజేసింది. ఈ సందర్భంగా ఆదిశేషు మాట్లాడుతూ భారత స్వాతంత్రోద్యమంలో ప్రధాన భూమికను పోషించింది చేనేత రంగమే అన్నారు. 1905 ఆగస్టు 7న కలకత్తాలో మొట్టమొదటిసారిగా స్వదేశీ ఉద్యమానికి అంకురార్పణ జరిగిందని, విదేశీ వస్త్రాలను బహిష్కరించి స్వదేశీ వస్త్రాలని ధరించాలన్న నినాదంతో ఉవ్వెత్తున ఎగిసిందన్నారు. అంతటి సుదీర్ఘమైన చరిత్ర చేనేతదని, భారతీయుల జీవితంతో పెనవేసుకుని భారతీయ సంస్కృతికి అర్థం పడుతుంది చేనేతయని వారు కొనియాడారు. చేనేత వస్త్రాలలో 95 శాతం భారత దేశంలోనే ఉత్పత్తి అవుతుందన్నారు. దేశంలో చేనేత రంగంలో కోటి 30 లక్షల మందికి పైగా ప్రత్యక్షంగాను, మరో 9 కోట్ల మంది పరోక్షంగాను ఆధారపడి జీవిస్తున్నారన్నారు.



చేనేత దినోత్సవం సందర్భంగా మాట్లాడుతున్న ఆదిశేషు..

భారతదేశంలో చేనేత పరిశ్రమ గణనీయమైన ఆర్థిక ప్రాధాన్యతను కలిగి ఉందని, వ్యవసాయం తర్వాత అత్యధిక మందికి ఉపాధి కల్పించేది చేనేత రంగమేనన్నారు. 17, 18 శతాబ్దాల నాటికి ప్రపంచ వస్త్ర వ్యాపారంలో 25 శాతం వాటా మన దేశాని దేనని వారు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరి వల్ల చేనేత రంగం తీవ్ర సంక్షోభంలోకి నెట్టబడిందని, చేనేత కార్మికులు ఉపాధి లేక వీధిన పడుతున్నారని ఆదిశేషు ఆవేదన వ్యక్తం చేశారు. చేనేత రంగానికి కేంద్ర ప్రభుత్వం రూ.25 వేల కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ.5 వేల కోట్లు కేటాయించి చేనేత రంగాన్ని బ్రతికించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మికులు ములకల ప్రసాద్, కుర్మా నాగేశ్వరి, కుర్మా వరలక్ష్మి, గుత్తి అచ్చయ్య, వాసా భాస్కర్, గోరు సూర్యనారాయణ, రుబ్బి రామలింగం, బలిశెట్టి వెంకటేశ్వరరావు, కనకం శ్రీనివాస్, వివిధ వృత్తిదారులు పాల్గొన్నారు.

సాగుదారులకు పట్టాలివ్వాలి : సిపిఎం

10న బైక్ ర్యాలీ

ప్రజాశక్తి - చాట్రాయి

ఎన్నో సంవత్సరాల నుంచి అటవీ, అసైన్డ్ భూములను సాగు చేసుకుంటూ జీవిస్తున్న నిరుపేదలకు ప్రభుత్వం పట్టాలివ్వాలని కోరుతూ ఈనెల 10న బైక్ ర్యాలీ నిర్వహిస్తామని సిపిఎం మండల కార్యదర్శి కొలికిపోగు భాస్కరరావు తెలిపారు. సిపిఎం మండల సమావేశం కోటపాడు గ్రామంలో సిఐటియు మండల కార్యదర్శి టిఎన్‌ఎం సూరి నివాసంలో సోమవారం నిర్వహించారు. ఈ సమావేశానికి సిపిఎం మండల కార్యదర్శి కొలికి పోగు భాస్కరరావు అధ్యక్షత వహించి మాట్లాడుతూ నిరుపేదలకు పట్టాలివ్వాలని ఈనెల 10 న బైక్ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. 15వ తేదీన స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గ్రామాలలోని శాఖల ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఆవిష్కరించాలని తీర్మానించారు. ఈ సమావేశంలో ముందుగా ప్రముఖ రచయిత, ప్రజానాట్యమండలి గాయకుడు గద్దర్‌కు, తిరువూరు డివిజన్ సిపిఎం కార్యదర్శిగా పనిచేసి మరణించిన మర్స కట్ల ప్రభాకర్ రావు చిత్రపటాలకు పూలమాలవేసి సంతాపం తెలియజేశారు. ఈ సమావేశంలో మండల పార్టీ సభ్యులు చాగంటి రాజారావు, కేశవరావు, కొమ్ము ఆనందం పాల్గొన్నారు.

గద్దర్ మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటు..

ప్రజాశక్తి - చింతలపూడి

గద్దర్ మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటని సిపిఐ మండల సహాయ కార్యదర్శి తుర్లపాటి బాబు అన్నారు. చింతలపూడి పట్టణంలో సోమవారం సిపిఐ కార్యాలయంలో ప్రజా గాయకుడు, కవి గద్దర్ హఠాన్మరణానికి సంతాపం తెలియజేశారు. ఈ సందర్భంగా బాబు మాట్లాడుతూ చదువుకుంటున్న రోజుల నుంచి విప్లవబాట పట్టి, తను ఆడి, పాడి తన పాటల ద్వారా ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రంలో అనేక వందల మందిని చైతన్య పరిచారన్నారు. గాయకులుగా, ఉద్యమకారులుగా వారిని ప్రజా ఉద్యమాల వైపు మళ్లించడంలో గద్దర్ అవిశ్రాంతంగా పనిచేశారని కొనియాడారు. అనేకసార్లు తనమీద హత్యా ప్రయత్నాలు జరిగినా మొక్కవోని దీక్షతో తను నమ్మిన సిద్ధాంతం కోసం దశాబ్దాల తరబడి పోరాడిన ధీశాలి గద్దర్ అని అన్నారు. ఈ సంతాప సభలో సిపిఐ మండల కమిటీ సభ్యులు దంతా కృష్ణ, కౌన్సిల్ సభ్యులు ఎస్.కె మస్తాన్, ఎస్‌కె కాలేషా, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

ముదినేపల్లి: దళిత ముద్దుబిడ్డ, ప్రజా గాయకుడు గద్దర్‌కు సోమవారం మండల కేంద్రమైన ముదినేపల్లిలో పలువురు నివాళులర్పించారు. గ్రామ సర్పంచి నిమ్మగడ్డ కైకమ్మ, వైసిపి రాష్ట్ర కార్యవర్గసభ్యులు నిమ్మగడ్డ భిక్షాలు, షేక్ గౌస్‌బేగ్, సోమల వరప్రసాద్, ఈడే ఉమా, పుట్టి నరసింహరావు, అబ్దుల్ రహీం, పళ్లెం పుణ్యేశ్వరరావు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు సిఎం ఆపన్నహస్తం

ఏలూరు/కుక్కునూరు: వరద బాధితుల సమస్యలను తెలుసుకునేందుకు కుక్కునూరు విచ్చేసిన ముఖ్యమంత్రిని దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు కలిసి తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. దీనిపై ముఖ్యమంత్రి స్పందించి వారికి సహాయం అందించాలని జిల్లా కలెక్టర్ వై.ప్రసన్న వెంకటేష్‌ను ఆదేశించారు. పెదవేగి మండలం ముండూరు గ్రామానికి చెందిన దొంత నాగరాజు కుమార్తె దొంత దుర్గ మౌనిక(21) రెండు కిడ్నీలు పాడవడంతో తీవ్ర అనారోగ్యానికి గురైంది. దీంతో సిఎం దగ్గర తమ బాధను వ్యక్తం చేసింది. తమ కుమార్తె వైద్యానికి సహాయం అందించాలని సిఎంను కోరారు. దుర్గా మౌనికను చూసిన సిఎం జగన్ చలించి ఆమె వైద్యం ఖర్చుల కోసం రూ.లక్ష ఆర్థిక సహాయం ప్రకటించారు.

9న చలో విజయవాడను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - నిడమర్రు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయివేటీకరణ, కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఆగస్టు 9వ తేదీన విజయవాడలో జరిగే మహా పడావో కార్యక్రమంలో కార్మికులంతా పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నారపల్లి రమణారావు కోరారు. సిఐటియు మండల కమిటీ సమావేశం పిల్ల హరికుమారి అధ్యక్షతన సోమవారం ప్రజా సంఘాల కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నారపల్లి రమణారావు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం సాధించడం కోసం 1942 ఆగస్టు 9వ తేదీన బ్రిటీష్ వారిని భారతదేశం నుంచి వెళ్లిపోవాలని క్విట్ ఇండియా ప్రజా ఉద్యమం ప్రారంభించారన్నారు. క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో కార్మికులందరూ ఏకమై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా మరో పోరాటం ఉద్యమంలో పాల్గొవాలని కోరారు. సమావేశంలో కోన శ్రీనివాస్, కమిలి నాని, లావేటి సోంబాబు, మోహన్, సారిక లలితకుమారి, సిహెచ్ వెంకటలక్ష్మి, రాధా పాల్గొన్నారు. అనంతరం ప్రజా చైతన్య ఉద్యమ నాయకుడు, గాయకుడు గద్దర్ మరణాన్ని చింతిస్తూ నివాళులర్పించారు. ఆయన మరణం ప్రజా కార్మిక ఉద్యమాలకు తీరని లోటని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రమణారావు అన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి : వ్యకాస

ప్రజాశక్తి - టి.నరసాపురం



సమస్యలు పరిష్కరించాలని వ్యకాస ఆధ్వర్యంలో ఆందోళన..

అల్లూరి సీతారామరాజు నగర్ వాసులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు అనుమోలు మురళి డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని ఎఎస్‌ఆర్ నగర్‌లో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ కృష్ణాపురం మెట్టలో సర్వే నెంబరు 86లో 2010 నుంచి సుమారు 70 కుటుంబాలకు చెందిన పేదలు గుడిసెలు వేసుకుని నివాసముంటున్నారని తెలిపారు. గ్రామంలో విద్యుత్, తాగునీటి సౌకర్యాలు లేక గిరిజనులు, పేదలు నానా అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు సమస్య పరిష్కారం కోసం అధికారులకు వినతిని అందించామని, అయినా పరిష్కారం కాలేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాదికారులు స్పందించి మౌలిక సదుపాయాలు కల్పించి అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఇళ్లస్తలాల పోరాట కమిటీ సభ్యులు మడకం కుమారి, వగ్గాల లక్ష్మి, బరగడ కుమారి పాల్గొన్నారు.

వార్డు సభ్యుల ఎన్నికకు షెడ్యూల్ విడుదల


మాట్లాడుతున్న ఎంపిడిఒ జి.రాణి

ప్రజాశక్తి - ముసునూరు

మూడు గ్రామాల్లో నాల్గు వార్డు మెంబర్ల సభ్యులకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ జి.రాణి తెలిపారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ జి.రాణి మాట్లాడుతూ గ్రామ పంచాయతీ పరిధిలో 11వ వార్డు, కాట్రేనీపాడు గ్రామ పంచాయతీ పరిధిలో 10వ వార్డు, వేల్పుచర్ల గ్రామ పంచాయతీ పరిధిలో 1, 5 వార్డులకు గాను నామినేషన్లు స్వీకరణ 8వ తేదీ నుంచి 10 తేదీ వరకూ ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ స్వీకరించబడునని తెలిపారు. స్కూటీని 11వ తేదీ, తిరస్కరించిన నామినేషన్లపై ఆర్‌డిఒకి అప్పిల్ చేయడానికి 13వ తేదీ, నామినేషన్ల ఉపసంహారణ ఆఖరి తేదీ 14వ తేదీ అని తెలియజేశారు. పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితా 14వ తేదీ వెలువడుతుందన్నారు. పోలింగ్ 9వ తేదీ ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ, అదేరోజు ఓట్లు లెక్కింపు మధ్యాహ్నం 2 గంటల నుంచి నిర్వహించబడునని అన్నారు. అలాగే ముసునూరు గ్రామానికి బివి.సుబ్బారావు ఎంఇఒ, కాట్రేనీపాడు గ్రామానికి కె.సత్య ప్రసాద్ ఎఇ, వేల్పుచర్ల గ్రామానికి ఎస్.మధుమోహన్ ఎన్నికల అధికార్లుగా వ్యవహరించనున్నట్లు తెలిపారు.

ఎపిఒగా రోస్‌లీలా నియామకం

జాతీయ గ్రామీణ ఉపాధిహామీ చట్టం మండల శాఖాధికారిగా(ఎపిఒ) టి.రోస్‌లీలా నియమింపబడిన్నట్లు ఎంపిడిఒ జి.రాణీ తెలిపారు. సోమవారం నుంచి ఆమె మండల ఎపిఒ భాధ్యతలు స్వీకరించారు. ఆమె ప్రకాశం జిల్లా నుంచి బదిలీపై ఏలూరు జిల్లా ముసునూరు మండలానికి వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టం పనిలో ఎటువంటి అవకతవకలూ జరగకుండా చూస్తానని తెలిపారు.

తాగునీటి సమస్యతో ప్రజల అవస్థలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

పట్టణంలో ప్రజలు తాగినీటి సమస్యతో అల్లాడుతున్నారు. సోమవారం తెల్లవారు జాము నుంచి తాగునీటి సరఫరా లేకపోవడం వల్ల ఇబ్బంది పడుతున్నామని పలువురు స్థానికులు వాపోయారు. గత రెండు రోజులుగా రాత్రిపూటలో వోల్టేజి సమస్య రావడంతో బోరు బావులు పనిచేయడం లేదు. దీంతో తెల్లవారుజాము నుంచి ఉదయం 11 గంటల వరకూ తీవ్రమైన తాగునీటి సమస్య ఎదురవుతుంది. కూలీ నాలీ చేసుకునే సామాన్య ప్రజలకు సకాలంలో తాగునీరు అందక ఉపాధిని కూడా కోల్పోతున్నామని వాపోతున్నారు. ప్రధానంగా 27వ వార్డు ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద వాటర్ ట్యాంక్ నుంచి ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వందల సంఖ్యలో పట్టణ నలుమూలకు వాటర్ క్యాన్లతో తాగునీటిని తీసుకెళ్లడం జరుగుతుంది. విద్యుత్ అంతరాయం వలన మోటర్‌లు తిరగడం ఆగిపోతున్నాయి. పట్టణంలో తాగు నీటి సరఫరా పూర్తిగా బోరుబావుల ఆధారంగా జరుగుతుంది. ఇటీవల విద్యుత్ శాఖ ఉద్యోగులు వర్క్ టు రూల్ పాటించడం వల్ల రాత్రి సమయంలో ఎదురవుతున్న విద్యుత్ సమస్యలను సకాలంలో పరిష్కరించడం లేదని పలువురు పేర్కొంటున్నారు. దీంతో పూర్తిస్థాయిలో బోరు బావులు ద్వారా తాగునీటి సరఫరాపై ఆధారపడిన జంగారెడ్డిగూడెం ప్రజలు రాత్రిపూటలో ఓల్టేజీ సమస్య, విద్యుత్ కోతలతో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారించి తాగునీటి సమస్య లేకుండా పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ సమస్యపై మున్సిపల్ కమీషనర్ భవానీ ప్రసాద్‌ను వివరణ అడుగగా విద్యుత్ అంతరాయం ఏర్పడకుండా సంబంధిత అధికారులను సంప్రదించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.


వోల్టేజీ సమస్యతో పనిచేయని మంచినీటి కుళాయిలు..

ఇందిరమ్మ కాలనీలో వెలిగిన వీధిదీపాలు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఎట్టకేలకు పంచాయతీ అధికారులు స్పందించారు. పలు సమస్యలతో సతమతమౌతున్న మండలంలోని గురజ ఇందిరమ్మ కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నట్లు గ్రామ సర్పంచి మంచాల సరస్వతీ, పంచాయతీ కార్యదర్శి రమణ తెలిపారు. ప్రజాశక్తిలో సోమవారం అధికారుల అలసత్వం.. పాలకుల నిర్లక్ష్యం అనే శీర్షికతో వార్త వెలువడిన విషయం పాఠకులకు విధితమే.. ఈవార్తపై స్పందించిన జిల్లాస్థాయి అధికారులు అదేశాలతో ఇఒపిఆర్‌డి సారథి పర్యవేక్షణలో పంచాయతీ కార్యదర్శి రమణ, గ్రామ సచివాలయ కార్యదర్శి హారిక వెంటనే ఇందిరమ్మ కాలనీలో పర్యటించి వెలగని వీధిదీపాలకు మరమ్మత్తులు చేయించి, వినియోగంలోకి తెచ్చారు. కాలనీలో పల్లపు ప్రాంతాల్లో నిల్వ ఉన్న వర్షపు నీటిని కచ్చా డ్రెయిన్లు ఏర్పాటు చేసి నీరు బయటకు పారుదల అయ్యేలా, కూలీలతో అడ్డంకులను తొలగించి మురుగునీరు బయటకు వెళ్లేందుకు అందుకు తగ్గ చర్యలు తీసుకున్నారు. కాలనీలో బురదగా ఉన్న అంతర్గత రోడ్లు సీసీ రోడ్లుగా, నీటి కొరత లేకుండా అందుకు తగిన చర్యలు త్వరితగతిన చేపడతామన్నారు. ఇందిరమ్మ కాలనీవాసులు పడుతున్న పాట్లు త్వరితగతిన పరిష్కరిస్తామని సర్పంచి సరస్వతీ, కార్యదర్శి రమణ తెలిపారు. కాలనీలోని ప్రతీ వీధిలో చెత్తాచెదారం తొలగించి, పారిశుధ్య పనులు నిర్వహించి బ్లీచింగ్ చల్లించారు.


వీధిదీపాలకు మరమ్మత్తులు చేస్తూ..


పనులను పర్యవేక్షిస్తున్న కార్యదర్శి రమణ

సెప్టెంబర్ 9న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల ప్రకారం సెప్టెంబర్ 9వ తేదీన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరి తెలిపారు. స్థానిక జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యాయసేవాధికారి సంస్థ భవనంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టుల పరిధిలో ఈ జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ అదాలత్ నందు అన్ని రకాల సివిల్ కేసులు, వాహన ప్రమాద భీమా కేసులు, చెక్ బౌన్స్ కేసులు, కుటుంబ వివాదాల కేసులు, శ్రీరామ్ చిట్స్, శ్రీరామ్ ట్రాన్స్పోర్ట్ మొదలైన చిట్ ఫండ్ కేసులు, బ్యాంకు లావాదేవీలు, అన్ని రకాల రాజీ యోగ్యమైన క్రిమినల్ కేసులను రాజీ చేయడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని కక్షిదారులు వినియోగించుకోవాలని తెలిపారు. కక్షిదారులు నేరుగా గాని, న్యాయవాది ద్వారా గాని, సంబంధిత మండల లీగల్ సర్వీసెస్ కమిటీల ద్వారా గానీ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థను కానీ సంప్రదించాలని సూచించారు. మే 13వ తేదీన జరిగిన జాతీయ లోక్ అదాలత్ నందు 6,349 కేసులను రాజీ చేయడం జరిగిందని, అలాగే ఈ జాతీయ లోక్ అదాలత్‌ను కూడా విజయవంతం చేయాలన్నారు. కేసుల పరిష్కారం నిమిత్తం ఏమైనా సందేహాలున్న 08812 224555ను సంప్రదించాలని తెలియజేశారు.

నూజివీడు రూరల్: పట్టణంలోని 15వ అదనపు జిల్లా జడ్జి కోర్టు నందు సెప్టెంబర్ 9 వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌పై మండల న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, 15 వ అదనపు జిల్లా జడ్జి ఎ.నాగ శైలజ సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లోక్ అదాలత్‌కు ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు. అన్ని రకాల కేసులు పరిష్కరిస్తామని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ సమావేశంలో పలువురు న్యాయాధికారులు, పోలీస్ అధికారులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

రమణారావు మృతి పార్టీకి తీరని లోటు : ఎంపీ శ్రీధర్

ప్రజాశక్తి - చింతలపూడి

ఊటసముద్రం గ్రామ మాజీ సర్పంచి, వైసిపి సీనియర్ నాయకులు గొట్టిపుల్ల రమణారావు మృతి చెందడం పార్టీకి, వారి కుటుంబానికి తీరని లోటని ఎంపి కోటగిరి శ్రీధర్ బాబు తెలిపారు. చింతలపూడిలోని రమణారావు కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎపి సాహిత్య అకాడమీ ఛైర్మన్ శ్రీలక్ష్మి, ఎఎంసి ఛైర్మన్, జగ్గవరపు జానకీ రెడ్డి, జడ్‌పిటిసి నీరజ సుధాకర్, ఎంపిపి డాక్టర్ రాంబాబు, నాయక్, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

వైసిపిలోకి టిడిపి శ్రేణులు

ప్రజాశక్తి - ముసునూరు

సిఎం జగన్‌మోహన్‌రెడ్డి పెట్టిన పథకాలకు ఆకర్షితులై టిడిపి నుంచి వైసిపిలోకి చేరుతున్న ప్రతిఒక్క నాయకులు పార్టీ కోరకు కృషి చేయాలని నూజివీడు నియోజకవర్గ ఎంఎల్‌ఎ మేకా వెంకటప్రతాప్ అప్పారావు తెలిపారు. ఆదివారం రాత్రి ముసునూరు మండలం చెక్కపల్లి గ్రామానికి చెందిన కాటేపల్లి రమేష్, చిలుకూరి శ్రీనివాసరావు, కాటేపల్లి వరప్రసాద్, మందలపు దుర్గారావులతో పాటు మరో 50 మంది కార్యకర్తలు వైసిపి మండల అధ్యక్షులు మూల్పురి నాగవల్లేశ్వరరావు ఆధ్వర్యంలో ఎంఎల్‌ఎ మేకా వెంకట ప్రతాప్‌అప్పారావు పార్టీ కండువా కప్పి ఘనంగా ఆహ్వానించారు. జడ్‌పిటిసి డాక్టర్ ప్రతాప్, వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయన, పాముల గంగధరరావు, ఎంపిటిసి తోట రమాదేవి, లోపూడి సర్పంచి పేరం కృష్ణ, ఉప సర్పంచి పద్మజా దేవీంద్ర, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వీరభద్రవరంలో 40మంది టిడిపిలో చేరిక

ప్రజాశక్తి - టి.నర్సాపురం

మండలంలోని వీరభద్రవరంలో సోమవారం టిడిపి సీనియర్ నాయకులు, రాష్ట్ర కార్యదర్శి శీలం వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పంచాయతీ వార్డు మెంబరు నైనారపు నాగేశ్వరరావు, తోట సత్యనారాయణతో పాటు సుమారు 40 మంది టిడిపిలో చేరినట్లు తెలిపారు. వీరిని శీలం వెంకటేశ్వరావు పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాధనంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి రావడం ఖాయమని, ప్రజలు టిడిపి విజయాన్ని కోరుకుంటున్నారన్నారు. అందుకే అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు టిడిపిలోకి చేరుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి నైనారపు జలపాలు ఉన్నారు.

ఎబిసిడి వర్గీకరణ సాధించాలి : ఎంఆర్‌పిఎస్

ప్రజాశక్తి - చింతలపూడి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎబిసిడి వర్గీకరణ చట్టబద్ధతకు అనుకూలంగా వ్యవహరించాలని ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు రుద్ర పోగు సురేష్ మాదిగ అన్నారు. చింతలపూడి పట్టణంలో స్థానిక సుప్రీం పేటలో నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా ఎం.హోటల్ దగ్గర నుంచి ఫైర్ స్టేషన్ వరకూ ర్యాలీ నిర్వహించి డాక్టర్ బిఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రావుల విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ పిలుపుమేరకు హైదరాబాదులో జరుగు విశ్వరూప సభకు మాదిగ, ఉప కులాలు భారీ సంఖ్యలో పాల్గొని విశ్వరూప సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాల ఎంఆర్‌పిఎస్ సమన్వయకర్త చౌటపల్లి విజయ మాదిగ, జాతీయ అధ్యక్షురాలు నక్షత్ర మాదిగ, జిల్లా ఎంఎస్‌పి సమన్వయకర్త ఎస్.కనకరాజు, చింతలపూడి నియోజకవర్గ ఎంఆర్‌పిఎస్ కన్వీనర్ తెమ్మంద్రు జోసెఫ్ తంబి, చింతలపూడి నియోజకవర్గ ఎంఎస్‌పిఎంఎస్ పి.మహిళా సమన్వయకర్త కొలికి పాము హైమావతి, ఎంఆర్‌పిఎస్ నియోజకవర్గ మహిళా సమన్వయకర్త సౌజన్య, నియోజకవర్గ ఎంఆర్‌పిఎస్ నియోజకవర్గ కన్వీనర్ లంక జయబాబు, ఏలూరు జిల్లా ఎమ్మెస్పీ నాయకురాలు లక్ష్మీ, ఎంఎస్‌పి ఏలూరు జిల్లా అధికార ప్రతినిధి సిద్దు పాల్గొన్నారు.